
# ధరల మోతలో మోదీనే నంబర్ 1

- గ్యాస్, పెట్రోల్ ధరల పెంపులో ప్రధాని మోదీ గ్లోబల్ రికార్డు
- ప్రపంచంలో ఎల్పీజీ రేటు భారతదేశంలోనే ఎక్కువ
- పెట్రోల్, డీజిల్ రేటులో వరుసగా 3, 8వ స్థానాలు
- ప్రజల కొనుగోలు శక్తి ఆధారంగా గ్రోక్ చాట్‌బాట్ వెల్లడి
- మోదీ హయాంలో గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు 130%, 40%, 60% మేర పెరిగాయన్న చాట్‌బాట్ స్పష్టీకరణ
- సామాన్యుడి సంపాదనలో 20% వీటికే ఖర్చని వెల్లడి



సామాన్యుడి నడ్డివిరుస్తూ గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రపంచ రికార్డును సొంతం చేసుకున్నది. ఇంధన ధరలను పెంచడంలో ప్రపంచంలో మరే ఇతర నాయకుడికి అందనంత ఎత్తులో ప్రధాని మోదీ నిలిచారు. అంతేకాదు ఎల్పీజీ ధర ఎక్కువగా ఉన్న దేశాల్లో భారత్ ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. పెట్రోల్ ధర ఎక్కువగా ఉన్న దేశాల జాబితాలో మూడో స్థానం, డీజిల్ ధరల విషయంలో ఎనిమిదో స్థానాన్ని ఆక్రమించింది. ఈ మేరకు ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్' గణాంకాలతో సహా కుండబద్దలు కొట్టింది. ప్రజల కొనుగోలు శక్తితుల్యత (పర్చేజింగ్ పవర్ పారిటీ-పీపీపీ) విధానాన్ని బట్టి ఈ మేరకు వివరించింది.




(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): పెరిగిన నిత్యావసరాల ధరలతో ఇప్పటికే సతమతమవుతున్న పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలను పెరిగిన గ్యాస్, పెట్రోల్ ధరలు మరింత కుదేలు చేస్తున్నాయి. 2014లో కేంద్రంలో అధికారాన్ని చేపట్టిన బీజేపీ ప్రభుత్వ హయాంలో ఇంధన ధరలు భగ్గుమన్నాయి. గ్యాస్, పెట్రో ధరల పెంపులో మోదీ సర్కారు కొత్త రికార్డులను నమోదు చేసింది. ప్రపంచంలో మరే ఇతర దేశాధినేతకు సాధ్యంకాని ఫీట్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సొంతం చేసుకొన్నారు. ప్రజలపై ఇంధన భారాన్ని అత్యధికంగా మోపిన ప్రధానుల్లో మోదీ నంబర్ 1 ప్లేస్‌లో నిలిచారు. అంతేకాదు.. ఎల్పీజీ ధర ఎక్కువగా ఉన్న దేశాల్లో భారత్ తొలి స్థానంలో నిలిచింది. అలాగే పెట్రోల్ రేటులో మూడు, డీజిల్ రేటులో ఎనిమిదో స్థానాన్ని సాధించింది. ఈ మేరకు నెటిజన్లు అడిగిన పలు ప్రశ్నలకు ప్రజల కొనుగోలు శక్తితుల్యత (పర్చేజింగ్ పవర్ పారిటీ-పీపీపీ) విధానాన్ని బట్టి ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్' సమాధానాలు ఇచ్చింది.

**ప్రశ్న: గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడంలో ప్రపంచంలో ఏ దేశాధినేత ముందున్నారు?**

గ్రోక్: గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడంలో ప్రపంచంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ ముందున్నారు. పదకొండేండ్ల మోదీ పాలనలో దేశంలో గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరిగాయి. పర్చేజింగ్ పవర్ పారిటీ (పీపీపీ) ఆధారంగా ఈ విషయం స్పష్టమవుతున్నది.

### ఏమిటీ పీపీపీ?

వేర్వేరు దేశాల ఆర్థిక వ్యవస్థని పోల్చి చూడడానికి ఆర్థిక వ్యవస్థ పరిమాణం, తలసరి ఆదాయం లాంటి అంశాలు మాత్రమే సరిపోవు. అభివృద్ధి చెందిన దేశాల తలసరి ఆదాయాలు రూ. 40 లక్షల స్థాయిలో ఉంటే, భారత్ వంటి దేశాల తలసరి ఆదాయాలు రూ. లక్ష లేదా లక్షన్నర దగ్గరే ఉంటున్నది. తలసరిని మాత్రమే ఆధారంగా తీసుకొంటే, అమెరికా తలసరి జీవన ప్రమాణాల స్థాయికీ, భారత జీవన ప్రమాణాల స్థాయికి 40 రెట్ల వ్యత్యాసం ఉండాలి. కానీ, అలా ఉండదు. కాబట్టి, దీన్ని ఇంకా మెరుగ్గా అంచనా వెయ్యడానికి తీసుకొచ్చిన పరిమితినే పర్చేజింగ్ పవర్ పారిటీ (ప్రజల కొనుగోలు శక్తి తుల్యత-పీపీపీ)గా చెప్తున్నారు. పీపీపీ గురించి వివరంగా చెప్పాలంటే.. భారత్‌లో కిలో ఆలుగడ్డలు రూ. 40గా ఉంటే, అమెరికాలో కిలో ఆలుగడ్డల రేటు 3 డాలర్లు (రూ. 258). అంటే కిలో ఆలుగడ్డలను కొనుగోలు చేయాలంటే భారత పౌరుడితో పోలిస్తే ఒక అమెరికన్ ఆరేడు రెట్లు వెచ్చించాలి. భారత్‌లో ఒక పూట భోజనం చేయడానికి రూ. 80 సరిపోతుంది. అమెరికాలో అదే భోజనం చేయాలంటే 10 డాలర్లు (రూ. 860) ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన భారత్‌లో పూట భోజనానికి రూ. 80 కొనుగోలు స్థాయిని, అమెరికాలోని రూ. 860 కొనుగోలు స్థాయికి సమానం అన్నట్టు పరిగణించాలి. ఇదే పీపీపీ భావన. అమెరికన్ డాలర్‌కు భారత కరెన్సీ మారకం విలువ రూ. 86గా ఉన్నది. అయితే, అంతర్జాతీయ ద్రవ్యనిధి గణాంకాల ప్రకారం.. పీపీపీ ఆధారంగా అంతర్జాతీయ డాలర్‌తో పోలిస్తే భారత కరెన్సీ విలువను ప్రస్తుతం రూ. 21.61గా నిర్ణయించారు. అంటే మన 21.61 రూపాయలు.. ఒక పీపీపీ డాలర్‌కు సమానమని గ్రహించాలి. ఈ పీపీపీ డాలర్ రేట్లను ఆధారంగా చేసుకొనే వివిధ దేశాల్లో ఎల్పీజీ, పెట్రోల్, డీజిల్ రేట్లను నిపుణులు గణించారు. ఈ క్రమంలో గ్యాస్ ధరలు ఎక్కువగా ఉన్న దేశాల్లో ఇండియా టాప్‌లో ఉండగా, పెట్రోల్, డీజిల్ రేట్లలో వరుసగా 3, 8వ స్థానంలో ఉన్నది.

**ప్రశ్న: ఏ దేశంలో ఎల్పీజీ ధర అత్యధికంగా ఉన్నది?**

గ్రోక్: పీపీపీ ఆధారంగా గణిస్తే.. ప్రపంచ దేశాల్లోకెల్లా భారత్‌లోనే ఎల్పీజీ సిలిండర్ ధర అత్యధికంగా ఉన్నది. భారత్‌లో ఒక సిలిండర్‌ను కొనుగోలు చేయడానికి 43 పీపీపీ డాలర్లను వెచ్చించాల్సి వస్తున్నది. అమెరికా, బ్రిటన్, చైనాతో పాటు పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ వంటి దేశాలతో పోల్చిచూసినా ఇది ఎంతో ఎక్కువ.

**ప్రశ్న: పెట్రోల్, డీజిల్ ధరల విషయంలో భారత్ ర్యాంకు ఎంత?**

గ్రోక్: పెట్రోల్ రేటు అత్యధికంగా ఉన్న దేశాల జాబితాలో భారత్ మూడో స్థానంలో ఉన్నది. డీజిల్ రేటులో ఎనిమిదో స్థానాన్ని ఆక్రమించింది. ప్రజల కొనుగోలు శక్తి తుల్యత ఆధారంగా గణిస్తే.. లీటర్ పెట్రోల్ కోసం సగటు భారతీయుడు 5 పీపీపీ డాలర్లను, లీటర్ డీజిల్ కోసం 4.3 పీపీపీ డాలర్లను వెచ్చించాల్సి వస్తున్నది.

**ప్రశ్న: మోదీ ప్రభుత్వ హయాంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఎలా పెరిగాయి?**

గ్రోక్: 2014 మేలో మోదీ ప్రధానిగా పగ్గాలు చేపట్టినప్పుడు అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు బ్యారెల్‌కు 105-110 డాలర్ల మధ్య ఉండేది. అప్పుడు లీటర్ పెట్రోల్ రూ. 71.51, లీటర్ డీజిల్ రూ. 57.28, ఎల్పీజీ రూ. 399గా ఉండేది. అయితే, ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల ముడిచమురు 60 డాలర్లకు లభిస్తున్నా ఎల్పీజీ లీటర్ పెట్రోల్ ధర రూ. 107కు చేరింది. లీటర్ డీజిల్ రూ. 95గా ఉన్నది. ఎల్పీజీ ధర రూ. 920కు చేరింది. 2014 నుంచి 2025 వరకూ పెట్రోల్ ధర 40 శాతం మేర, డీజిల్ ధర 60 శాతం మేర, గ్యాస్ ధర 130 శాతం మేర పెరిగింది.


**ప్రశ్న: రోజువారీ ఆదాయంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్‌కు భారతీయులు ఎంత మొత్తాన్ని ఖర్చు చేస్తున్నారు?**

గ్రోక్: పీపీపీ ఆధారంగా భారత్‌లోని సగటు పౌరుడు తాను సంపాదించే రోజువారీ ఆదాయంలో 19.6 శాతం మొత్తాన్ని పెట్రోల్, డీజిల్, గ్యాస్ కోసం ఖర్చు చేస్తున్నాడు. ఒక పౌరుడి ఆదాయం రోజుకు రూ. వెయ్యి అనుకొంటే ఇందులో రూ. 196ను గ్యాస్, పెట్రోల్, డీజిల్ కోసం ఖర్చు చేస్తున్నట్టు అర్థం చేసుకోవచ్చు.

---

## మాతృభాషకు అన్యాయం చేయవద్దు

**బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ మాజీ చైర్మన్ డాక్టర్ రమణాచారి**



హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): ఇంటర్మీడియట్ సెకండ్ లాంగ్వేజ్‌గా సంస్కృతాన్ని ప్రవేశపెట్టాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని పూర్వ ఐఏఎస్ అధికారి, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ మాజీ చైర్మన్ డాక్టర్ రమణాచారి విజ్ఞప్తిచేశారు. సంస్కృతాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవడంలో తప్పులేదని.. అలాగే తెలుగు భాషను విద్యార్థులను దూరం చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో విద్యార్థులకు అటు తెలుగుపై, ఇటు సంస్కృతంపై పట్టులేకుండాపోయే అవకాశం ఉన్నదని అభిప్రాయపడ్డారు. విద్యార్థులను తెలుగుభాషకు దూరం చేస్తే.. మాతృభాషకు అన్యాయం చేసినట్టే అవుతుందని అన్నారు. ఇంటర్మీడియట్‌లో తెలుగును సెకండ్ లాంగ్వేజ్‌గా కొనసాగించాలని తెలుగు భాషాభిమానిగా తాను కోరుకుంటున్నట్టు రమణాచారి వివరించారు.

## నేటి నుంచి అమల్లోకి ఎస్సీ వర్గీకరణ చట్టం

- క్యాబినెట్ సబ్ కమిటీ తుది సమావేశంలో నిర్ణయం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం నుంచి ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని, అందుకు సంబంధించిన జీవోను జారీ చేయనున్నట్టు క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రకటించారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అంశానికి సంబంధించిన క్యాబినెట్ సబ్-కమిటీ తుది సమావేశాన్ని సచివాలయంలో ఆదివారం మధ్యాహ్నం నిర్వహించారు. చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో కొనసాగిన సమావేశంలో ఉప కమిటీ వైస్ చైర్మన్, మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, కమిషన్‌కు నాయకత్వం వహించిన రిటైర్డ్ న్యాయమూర్తి షమీమ్ అక్తర్, ఎస్సీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, లా సెక్రటరీ తిరుపతి, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. కమిషన్ సిఫారసుల అమలు మార్గదర్శకాలను కమిటీ సమీక్షించింది. అనంతరం సబ్‌కమిటీ చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. చట్టం విధి విధానాలను వివరించే ప్రభుత్వ ఉత్తర్వు (జీవో)ను అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం జారీ చేస్తామని, మొదటి ప్రతిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేస్తామని వెల్లడించారు. ఎస్సీ ఉప-వర్గీకరణను అమలుచేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందని చెప్పారు. ప్రస్తుతం ఉన్న ఏ ప్రయోజనాలనూ నీరుగార్చబోమని, అన్నీ ఎస్సీ వర్గాల హక్కులను కాపాడుతూ న్యాయాన్ని పెంపొందించడానికి వర్గీకరణ రూపొందించామని వెల్లడించారు.

**ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ ఇలా**

| గ్రూపు | ఉపకులాలు | రిజర్వేషన్ శాతం |
|---|---|---|
| ఏ | 15 | 1% |
| బీ | 18 | 9% |
| సీ | 26 | 5% |

---

## బినామీ పేర్లతో 'కడియం'కు భూములు

**వ్యవసాయం చేయించిన ఆధారాలను బయటపెడతా**

భూబాగోతాన్ని దేవునూరు ప్రజలే బట్టబయలు చేస్తరు

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హెచ్చరిక




జనగామలోని పార్టీ కార్యాలయంలో లింగాల ఘనపురం మండల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): 'దేవునూర్‌లో నీ బినామీల పేర్లతో భూములు ఉన్నాయ్.. అందులో నువ్వే వ్యవసాయం చేయించిన ఫొటోలను త్వరలో బయటపెడుతా.. నీ భూబాగోతాన్ని ప్రజల్లో బట్టబయలు చేస్తా.. జాగ్రత్త బిడ్డా! ఇక నువ్వు ఏది మాట్లాడిన చెల్లదు.. నీకు చీము, నెత్తురు, సిగ్గు శరం ఉంటే రాజీనామా చేసి ఉపఎన్నికకు రా.. పిచ్చిగా మాట్లాడితే స్టేషన్ ఘన్‌పూర్‌లో నిన్ను రాజకీయంగా బొందపెట్టడం గ్యారెంటీ' అని ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ జనగామ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన లింగాలఘనపురం మండల సన్నాహక సమావేశంలో పల్లా మాట్లాడారు. 'హనుమకొండలో అత్యంత పెద్ద ఇల్లు కట్టుకున్నవ్.. దానికి డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయ్? ఎవరు కట్టించారో నీకు తెలియదా? నీకు వచ్చిన పనులన్నీ నీ అల్లుడితో చేయిస్తలేవా? హైదరాబాద్‌లో మూడు ఇండ్లు కట్టినవ్.. అమెరికాలో మూడిండ్లు ఉన్నయ్.. వాటికి డబ్బులు ఎక్కడ నుంచి వచ్చాయ్' అంటూ కడియాన్ని ప్రశ్నించారు. 'నీకు బరాబర్‌గా దేవునూర్‌లో భూమి ఉన్నది.. నీ బినామీ పేర్ల మీద ఉన్నది. నువ్వు వ్యవసాయం చేయించినవ్. నీకు కావాల్సిన ఫొటోస్ బయట పెడుతా. ఇవన్నీ వాస్తవాలని దేవునూర్ ప్రజలే చెప్తరు' అని ఆయన స్పష్టంచేశారు.


**దేవాదులకు చేసిందేమీ లేదు?**

'అశ్వరావుపల్లి నుంచి ఆర్‌ఎస్ ఘన్‌పూర్ మీదుగా నవాబ్‌పేటకు కావాల్సిన కాల్వల నిర్మాణం బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే జరగలేదా? దేవాదుల గురించి నేను చేశానని ఎట్లా మాట్లాడుతవ్' అని ఎమ్మెల్యే కడియంపై పల్లా ధ్వజమెత్తారు. రూ.104 కోట్లతో ఎత్తయిన ప్రాంతాలకు నష్కల్ దగ్గర ఒక్క లిఫ్ట్, గండిరామారం దగ్గర రెండో లిఫ్ట్, పీసర దగ్గర మూడో లిఫ్ట్‌లను తెచ్చింది తానేనని ఆయన స్పష్టం చేశారు. రూ.800 కోట్లలో రూ.వంద కోట్లు తెచ్చానని చెప్పడానికి సిగ్గులేదా? అని ప్రశ్నించారు. దేవాదుల పూర్తి చేసింది, ఏడు రిజర్వాయర్లు కట్టించింది కేసీఆర్ నాయకత్వంలో ఉన్న రెండు ప్రభుత్వాలు తప్పా మరొకటి కాదని అన్నారు. 'నీకు సభ్యత, సంస్కారం, సహనం లేదు. నేను స్టేషన్‌ఘన్‌పూర్‌కు గెస్ట్‌ను, నువ్వు ఘోస్ట్‌వి మాత్రమే' అని పల్లా మండిపడ్డారు. 'నీకు దమ్మూ ధైర్యం ఉంటే నియోజకవర్గంలో నువ్వు నా కన్నా ఒక్క రోజు ఎక్కువ తిరిగినట్టు రుజువు చేస్తే నేను రాజీనామా చేస్తా'నని పల్లా సవాల్ చేశారు. నియోజకవర్గంలో నా కంటే ఎన్నిరోజులు ఎక్కువ తిరిగావ్? అసెంబ్లీకి నువ్వు ఎన్ని రోజులు వచ్చావ్? నేను ఎన్ని రోజులు వచ్చానో లెక్క బెడుదాం. నాకన్నా ఒక్క రోజు ఎక్కువ వచ్చినట్టు తేలినా, అసెంబ్లీలో నువ్వు నా కన్నా ఒక్క నిమిషం ఎక్కువ మాట్లాడినట్టు తేల్చినా నేను రాజీనామా చేస్తా'నని పల్లా స్పష్టంచేశారు.

---

## గ్రూప్-1 ఫలితాల్లో గోల్‌మాల్ వాస్తవమే

- విచారణ కమిషన్ ఏర్పాటు చేస్తే ఆధారాలిచ్చేందుకు సిద్ధం
- సమాధానం చెప్పలేకే టీజీపీఎస్సీ పరువు నష్టం దావా వేసింది
- టీపీసీసీలా మారిపోయిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్
- కేసులకు భయపడేదిలేదు.. పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదు
- బీఆర్‌ఎస్ నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి స్పష్టీకరణ



హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తేతెలంగాణ): గ్రూప్-1 ఫలితాల్లో అవతవకలు జరిగింది ముమ్మాటికీ వాస్తవమేనని, రాజ్యాంగబద్ధ సంస్థ అయిన టీజీపీఎస్సీ తనపై పరువు నష్టం దావా వేస్తామని నోటీసుల పేరిట బెదిరింపులకు దిగడం దారుణమని బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. నోటీసులకు మూడు రోజుల్లో దీటుగా సమాధానమిస్తా.. అంతేగాని ఎట్టిపరిస్థితుల్లో క్షమాపణ చెప్పేదిలేదని తేల్చిచెప్పారు. తన ఆరోపణలు తప్పని టీజీపీఎస్సీ భావిస్తే న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆధారాలు అందించి అక్రమాలు రుజువుచేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు. దేశ చరిత్రలోనే ఓ చట్టబద్ధ సంస్థ ఓ వ్యక్తి భావప్రకటన స్వేచ్ఛను కాలరాసేందుకు పూనుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. ఆదివారం తెలంగాణభవన్‌లో రాకేశ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. తాను లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే టీజీపీఎస్సీ ఇజ్జత్ దావాతో భయపెట్టాలని చూస్తున్నదని మండిపడ్డారు. టీజీపీఎస్సీ తీరు చూస్తుంటే టీపీసీసీగా మారిందనే అనుమానం కలుగుతున్నదని విమర్శించారు. 'వ్యక్తుల భావ ప్రకటన స్వేచ్ఛను హరించే హక్కు సర్వీసు కమిషన్‌కు ఎక్కడిది? నేను మాట్లాడితేనే పరువుపోయిందా? అదేమైనా కోర్టా? తన మాదిరిగా ఫిర్యాదు చేసిన అభ్యర్థులపై కేసులు పెడతారా? కథనాలు రాసిన పత్రికలపై పరువు నష్టం దావా వేస్తారా?' అంటూ సూటిగా ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కమిషన్‌పై ఆరోపణలు చేయలేదా..? అని నిలదీశారు. కమిషన్ తాటాకు చప్పుళ్లు, ఉడుత ఊపులకు భయపడేది లేదని, నిరుద్యోగులకు న్యాయం జరిగేదాకా బరిగీసి కొట్లాడుతామని పునరుద్ఘాటించారు.

**టీజీపీఎస్సీపైనే కేసు పెడతా..**

పక్కా ఆధారాలతోనే సర్వీస్ కమిషన్‌పై ఆరోపణలు చేశానని రాకేశ్‌రెడ్డి స్పష్టంచేశారు. 13 ఏండ్ల నుంచి రాజకీయాల్లో ఉంటూ దేశ, విదేశాల్లోని ప్రతిష్ఠాత్మక సంస్థల్లో పని చేసిన తాను అల్లాటప్పాగా ఆరోపణలు చేయలేదని పేర్కొన్నారు. తన ప్రాథమిక హక్కులకు భంగం కలిగించిన టీజీపీఎస్సీపైనే కోర్టులో దావా వేస్తానని హెచ్చరించారు. సర్కారు ఎన్ని కుట్రలు చేసిన, కుతంత్రాలకు దిగిన అభ్యర్థులకు న్యాయం జరిగేదాకా విశ్రమించేది లేదని తేల్చిచెప్పారు. తప్పు చేసిన టీజీపీఎస్సీయే తనకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

**పరువుతీసే పనులు చేసింది టీజీపీఎస్సే..**

తాను టీజీపీఎస్సీపై నిరాధారణ ఆరోపణలు చేయలేదని, పరువు తీసే పనులు చేసింది టీజీపీఎస్సేనని రాకేశ్ రెడ్డి నిప్పులు చెరిగారు. 'ప్రిలిమ్స్, మెయిన్స్‌కు వేర్వేరు హాల్‌టికెట్లు ఇవ్వడం? 563 మంది ర్యాంకర్లలో టాప్-500లో ఒక్క తెలుగుమీడియం అభ్యర్థి లేకపోవడం.. 46 సెంటర్లలో కేవలం రెండింటిలోనే ఎక్కువమంది సెలెక్ట్ కావడం.. వరుసగా ఉన్న అభ్యర్థులకు ఒకే విధమైన మార్కులు రావడం.. చూస్తుంటే కమిషన్ వెలగబెట్టిన ఘనకార్యం ఇట్టే తెలిసిపోతుంది' అని ఘాటువ్యాఖ్యలు చేశారు. నిర్లక్ష్యం తనది కాదని ముమ్మాటికీ టీజీపీఎస్సీదేనని చెప్పారు.

## అకాల వర్షానికి రైతన్న ఆగం

**ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిలాల్లో వడగండ్ల వాన**

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ రఘునాథపాలెం, ఏప్రిల్ 13: ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ఆదివారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా దమ్మపేట, చంద్రుగొండ, కొత్తగూడెం, రుద్రంపూర్, పాల్వంచ మండలాల్లో వడగండ్లు పడ్డాయి. దుమ్ముగూడెం మండలంలో తాటిచెట్టుపై పిడుగుపడటంతో చెట్టు కాలిపోయింది. చుంచుపల్లి, బూర్గంపహాడ్, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, దమ్మపేట, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో అకాల వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. చుంచుపల్లి మండలం పెనగడప కొనుగోలు కేంద్రంలో రైతులు కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. అన్నపురెడ్డిపల్లి సహా మరికొన్ని చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. జనగామ జిల్లాలోని జనగామ రూరల్, నర్మెట, తరిగొప్పుల, దేవరుప్పుల తదితర మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన రైతులకు కడగండ్లను మిగిల్చింది. ఆదివారం మధ్యాహ్నం ఉరుములు, గాలులతో కూడిన మోస్తరు వానతో మామిడితోటలకు నష్టం వాటిల్లగా కోతకు వచ్చిన వరి పంట నేలపాలైంది. ములుగు జిల్లా ఏటూరునాగారం, తాడ్వాయి, మంగపేట మండలాల్లో గాలి దుమారంతోపాటు వడగండ్లు కురిశాయి.

## స్వచ్ఛ గాలి కోసం ఆందోళన




కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో వాయు కాలుష్యాన్ని నివారించడంలో పీసీబీ అధికారులు విఫలమయ్యారని ఆదివారం బాచుపల్లి, మల్లంపేట, ఐడీపీ బొల్లారం శివారులోని కాలనీలవాసులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు స్వచ్ఛమైన గాలి దొరకక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మండిపడ్డారు. ఇక్కడ జీవించే పరిస్థితి లేకుండాపోతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. - దుండిగల్

## కానిస్టేబుల్ అత్యుత్సాహానికి బైకర్ బలి

- తనిఖీ కోసం లాగడంతో బస్సుకింద పడి అక్కడికక్కడే వాహనదారుడి దుర్మరణం
- మద్యం మత్తులో కానిస్టేబుల్ విధులు?
- బ్రీత్ ఎనలైజర్ టెస్ట్ చేయకుండా తప్పించిన వైనం

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): కేవలం చలానాలు, వసూళ్లపైనే దృష్టి పెడుతున్న ట్రాఫిక్ పోలీసులు, వాహనదారుల భద్రతను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తనిఖీల పేరిట ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తూ వాహనదారులను ఇబ్బంది పెడుతున్నారనేందుకు ఆదివారం జరిగిన ఘటన మరో ఉదాహరణగా నిలిచింది. వాహనాలను ఆపే క్రమంలో ఎదురు నిలబడడం, వెంటనే హ్యాండిల్ పట్టుకొని లాగడం, వాహనాల కీని లాక్కోవడం లాంటి చర్యలతో కింద పడి వాహనదారులు గాయలపాలవుతున్న ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. ఇలానే వాహనాల తనిఖీ పేరిట ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ చూపిన అత్యుత్సాహం ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకున్నది. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను తనిఖీ చేయడమే కాకుండా వాహనదారుడిని పట్టుకొని లాగడంతో అదుపు తప్పి అతడు ఆర్టీసీ బస్సు కింద పడి అక్కడికక్కడే చనిపోవడం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటనతో ట్రాఫిక్ సిబ్బంది పనితీరుపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. వివరాల్లోకి వెళ్తే.. ఏపీలోని అమలాపురం ప్రాంతానికి చెందిన జోష్‌బాబు కొంతకాలం క్రితమే వచ్చి హైదరాబాద్‌లోని గాజులరామారం రోడా మిస్త్రీనగర్‌లో స్థిరపడ్డాడు. వృత్తిరీత్యా కార్పెంటరైన జోష్‌బాబుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆదివారం మధ్యాహ్నం 12.45 గంటల సమయంలో జీడిమెట్ల వైపు నుంచి పంజాగుట్ట వెళ్లేందుకు బైక్‌పై వస్తుండగా బాలానగర్ ట్రాఫిక్ పీఎస్ ఎదుట కానిస్టేబుల్ గోపాల్ మరో ఇద్దరు హోంగార్డులతో కలిసి వాహనాల తనిఖీ చేస్తున్నాడు. ఈ క్రమంలో కానిస్టేబుల్ గోపాల్ బైక్‌పై వస్తున్న జోష్‌బాబును ఆపే క్రమంలో అతడిని పట్టుకొని లాగాడు. దీంతో అదుపుతప్పిన జోష్‌బాబు కిందపడిపోవడంతో అదే సమయంలో వచ్చిన ఆర్టీసీ బస్సు అతడి తలపై నుంచి వెళ్లింది. దీంతో జోష్‌బాబు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కండ్లముందే జరిగిన ఈ ఘోరాన్ని చూసి వాహనదారులు, స్థానికులు కోపంతో కానిస్టేబుల్‌ను కొట్టేందుకు ప్రయత్నించారు. వారి ఆందోళనతో బాలానగర్-జీడిమెట్ల ప్రధాన రహదారి స్తంభించిపోవడంతో పోలీసులు వచ్చి లాఠీలు ఝుళిపించి అక్కడి నుంచి చెదరగొట్టారు. జోష్‌బాబు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీకి తరలించారు.


### మద్యం మత్తులో కానిస్టేబుల్ విధులు?

కానిస్టేబుల్ మద్యం మత్తులో పక్కకు లాగడం వల్లే జోష్‌బాబు బస్సు కింద పడి చనిపోయాడని మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికులు చెప్పారు. మృతుడి సోదరుడు నాగ ఫణీంద్ర బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా గోపాల్‌పై కేసు నమోదు చేశారు. కానిస్టేబుల్ మద్యం మత్తులో ఉన్నట్టు వస్తున్న ఆరోపణల మేరకు అతడిని వైద్యపరీక్షల కోసం గాంధీ దవాఖానకు పంపారు. సదరు కానిస్టేబుల్ మద్యం మత్తులో లేడని వాదిస్తున్న పోలీసులు, అతడికి వెంటనే బ్రీత్ ఎనలైజర్ టెస్ట్ ఎందుకు చేయలేదని మృతుడి కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారు.

---

## వనజీవికి కన్నీటి వీడ్కోలు

- కడసారి చూసేందుకు భారీగా తరలివచ్చిన అభిమానులు
- నివాళులర్పించిన మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి
- పార్థివదేహానికి అంజలి ఘటించిన ఖమ్మం డీఎఫ్‌వో సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్
- అధికారుల పర్యవేక్షణ.. కానరాని అధికార లాంఛనాలు



ఖమ్మం జిల్లా రెడ్డిపల్లిలో వనజీవి రామయ్య అంతిమయాత్రలో పాల్గొన్న ఆయన అభిమానులు

ఖమ్మం, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : హరిత ప్రేమికుడు, పద్మశ్రీ వనజీవి(దరిపల్లి) రామయ్యకు ప్రకృతి ప్రేమికులు, గ్రామస్థులు, అధికారులు కన్నీటి వీడ్కోలు పలికారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన రామయ్య.. శనివారం తెల్లవారుజామున ఆయన స్వగృహంలో గుండెపోటుతో కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆదివారం ఆయన స్వగ్రామంలో కుటుంబ సభ్యులు, బంధువులు రామయ్య అంత్యక్రియలు పూర్తిచేశారు. రామయ్య ఆఖరి మజిలీ పూర్తయ్యేవరకు ఖమ్మం రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి దగ్గరుండి అన్ని ఏర్పాట్లు చేశారు. అంత్యక్రియల సందర్భంగా పాడె మోశారు. వనజీవి అంత్యక్రియలు ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలో జరిగినప్పటికీ అధికారిక లాంఛనాలతో మాత్రం జరగలేదు.

**రెడ్డిపల్లిలో అంతిమయాత్ర ప్రారంభం..**

అంత్యక్రియల్లో భాగంగా ఆదివారం ఉదయం 11 గంటలకు రెడ్డిపల్లిలోని రామయ్య ఇంటి నుంచి ప్రారంభమైన అంతిమయాత్ర.. మధ్యాహ్నం ఒంటి గంటకు ముగిసింది. డీఎఫ్‌వో సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ చివరిసారిగా రామయ్య పార్థివదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి అంజలి ఘటించారు. అటవీ శాఖ సిబ్బంది పరేడ్ అనంతరం అంత్యక్రియలు ముగిశాయి. రామయ్య అంత్యక్రియలు పూర్తయిన అనంతరం అక్కడి వైకుంఠ ధామంలో ఆయన అభిమానులు మొక్కలు నాటారు. ఆర్డీఓ నర్సింహారావు, అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, ప్రముఖ సామాజిక వేత్తలు పాల్గొన్నారు.

**మంత్రి పొంగులేటి నివాళి**

పద్మశ్రీ రామయ్య పార్థివదేహానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, నీటిపారుదల, అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు తదితరులు రెడ్డిపల్లిలో అంజలి ఘటించారు.

**సొమ్మసిల్లి పడిపోయిన జానకమ్మ..**

మరికాసేపట్లో వనజీవి అంతిమయాత్ర ప్రారంభం కాబోతున్న సమయంలో ఆయన సతీమణి జానకమ్మ ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయారు. దీంతో అక్కడే ఉన్న బంధువులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అక్కడే ఉన్న జిల్లా దవాఖానల సమన్వయకర్త డాక్టర్ రాజశేఖర్ జానకమ్మకు ప్రాథమిక వైద్యం అందించారు.